ఏపీ మాజీ సీఎంకు ఆహ్వానం



ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పెళ్లి పత్రికను అందజేస్తున్న సురేష్‌రెడ్డి

కుత్బుల్లాపూర్: ఏపీ మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 30న సురేష్‌రెడ్డి కుమార్తె వివాహం ఉన్న నేపథ్యంలో శుభలేఖను అందజేశారు. ఆయన వెంట కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన పలువురు నేతలు ఉన్నారు.

ఘనంగా కొలన్ శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

నిజాంపేట్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఆయన అభిమానులు, పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రాజేశ్వరి వృద్ధుల అనాథ ఆశ్రమం నందు ఎం.శ్రీనివాస్ (ఆటో) ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కె.ఎస్ తనయుడు కొలన్ తరుణ్‌రెడ్డి, మన్నె మహేష్ యాదవ్ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని వృద్ధులకు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో గౌస్, సురేష్ నాయక్, ప్రసాద్‌గౌడ్, బాలకృష్ణ, సుధాకర్, మిర్చి, భూషణం, ముద్దు, గోపాల్, సత్యవతి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం



రాధా మనోహర్ దాస్‌ను సన్మానిస్తున్న భిక్షపతి యాదవ్


నిజాంపేట్: హిందూ ధర్మ పరిరక్షణకై నిరంతరం పాటుపడుతున్న రాధా మనోహర్ బుధవారం హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా భిక్షపతి యాదవ్ వారిని సన్మానించారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హిందూ సనాతన ధర్మ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ గుప్తా, సచిన్ పాల్గొన్నారు.

అల్లుకున్న నిర్లక్ష్యం!



చింతల్: తరచూ చెట్ల కొమ్మలు తొలగింపు పేరుతో విద్యుత్ అధికారులు అడపా దడపా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నా అనుకున్న లక్ష్యం మాత్రం నెరవేరడం లేదు. సిబ్బంది నిర్లక్ష్యంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలపై కలుపు మొక్కలు, చెట్లకొమ్మలు కనిపిస్తున్నాయి. చింతల్ డివిజన్ శ్రీసాయికాలనీలోని పలు గల్లీల్లో విద్యుత్ తీగలను చెట్లకొమ్మలు తాకడంతో గాలులు వీసిన సమయంలో ట్రిప్ అయి సరఫరా నిలిచిపోతోంది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా సిబ్బంది స్పందించడం లేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



జీడిమెట్ల: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం కుత్బుల్లాపూర్ బస్టాప్‌లో ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహం వద్ద పంచనామా నిర్వహించగా.. ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని, భిక్షాటన చేసే వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే జీడిమెట్ల పీఎస్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

అధికారుల నిర్లక్ష్య వైఖరి, అలసత్వం, సమన్వయ లోపం స్థానిక ప్రజలకు శాపంగా మారింది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరు దిగువ ప్రాంతానికి చేరడంతో ఇళ్లలోకి పూర్తిగా డ్రైనేజీ నీరు చేరింది. దీంతో లక్షలు పెట్టి ఇళ్లను కొనుగోలు చేసి.. సొంతింట్లో తమ కుటుంబంతో సంతోషంతో జీవిద్దామని ఆశ పడిన వారి ఆశలను కేవలం మురుగు నీరు అడియాశలు చేశాయి. ఇంటి మొత్తాన్ని మురుగు నీరు ముంచెత్తడంతో కట్టు బట్టలతో సొంతింటిని వదిలేసి కిరాయి బాట పట్టారు. ఎక్కడి నుంచో వచ్చిన మురుగు నీరు తమ ఇళ్లను ముంచెత్తడంతో నిరాశ్రయులయ్యారు.



అయ్యో ..'రామచంద్రా'..

మురుగులోనే రామచంద్రయ్య కాలనీ



మల్లంపేటలోని చెన్నం చెరువు

- ఎగువ ప్రాంతం నుంచి ముంచెత్తిన మురుగునీరు
- అధికారుల సమన్వయ లోపం.. ప్రజలకు శాపం
- ఏడు నెలలుగా ఇళ్లలోనే డ్రైనేజీ నీరు
- అద్దె ఇళ్లలో కాలం వెల్లదీస్తున్న కాలనీవాసులు

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని సర్వే నెంబరు 294, రామచంద్రయ్య కాలనీలు ఉన్నాయి. ఇందులో దాదాపు 25 కుటుంబాలు నివాసముంటున్నాయి. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రణీత్ యాంటీల, 21 సెంచరీ, ఆర్టీసీ కాలనీ, ఎస్ఆర్ఎస్, క్రాంతినగర్ ప్రాంతాలకు చెందిన సుమారు 35 వేల ఫ్లాట్లకు సంబంధించిన డ్రైనేజీ ఔట్‌లెట్ లేకపోవడంతో నేరుగా మల్లంపేటకు వస్తుంది. మల్లంపేటలోని చెన్నం చెరువులోకి మురుగు నీటితో పాటు వర్షపు నీరు చేరడంతో ఆ నీరంతా దిగువ ప్రాంతానికి వెళ్తుంది.

అసలు సమస్య ఇక్కడే..

మల్లంపేటలోని చెన్నం చెరువుకు వరద నీరు అధికంగా వస్తే బొల్లారంలోని రేళ్లకుంటకు గొలుసుకట్టు ద్వారా నీటిని మళ్లించే అవకాశం ఉండేది. అయితే చెన్నం చెరువు సమీపంలోని మల్లంపేట నుంచి బాచుపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు వద్ద ఓ వ్యక్తి చెరువుకు సంబంధించిన నాలాను తన ప్రైవేటు స్థలంగా పేర్కొంటూ మూసి వేశాడు. దీంతో అక్కడి నుంచి ఈ సమస్య ఉత్పన్నమైంది.

నాలా పూడ్చివేసినా స్పందించని అధికారులు

వివిధ శాఖల అధికారుల సమన్వయ లోపం వల్ల మల్లంపేట ప్రాంత ప్రజలు నరకం చూస్తున్నారు. ముఖ్యంగా ఇందులో ఇరిగేషన్ శాఖ అధికారుల పని తీరు పేలవంగా కనిపిస్తుంది. ముందుగా చెన్నం చెరువు నుంచి రేళ్లకుంట వరకు చెరువు నాలాను గుర్తించి మ్యాప్‌ను ఇస్తే సరిపోతుంది. ప్రైవేటు స్థలంలో ఓ వ్యక్తి తన స్థలమని నాలాను పూడ్చివేసినా ఇప్పటి వరకు స్పందించకపోవడం విడ్డూరం. ఏడు నెలలు కావస్తున్నా ఒక చెరువు నుంచి మరో చెరువు వరకు నాలా హద్దులను ఏర్పాటు చేయలేదు. ఇదే విషయాన్ని సాకుగా చూపిస్తు మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులు తమ తప్పులను కప్పి పుచ్చుకుంటున్నారు. ఇరిగేషన్ శాఖ నాలా హద్దులను గుర్తించి నివేదిక ఇస్తే తమ నిధులతో పైపులైన్లను ఏర్పాటు చేస్తామని మున్సిపల్ శాఖ, ఇటు ఇరు శాఖలు సహకరిస్తే కల్వర్టు పనులను పూర్తి చేస్తామని హెచ్ఎండీఏ అధికారులు పైకి చిలక పలుకులు పలుకుతూ సమస్యను మాత్రం పరిష్కరిచడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికే పలు దఫాలుగా వివిధ శాఖల అధికారులు ఈ ప్రాంతంలో పర్యటించినా ఒక అడుగు ముందుకు..రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమన్వయంతో కలిసి పని చేస్తారా.. లేదా యధావిధిగా నిర్లక్ష్యంగా గాలికి వదిలేస్తారా.. అన్నది వేచి చూడాలి..

అధికారులు పట్టించుకోవడం లేదు



మురుగు నీటి సమస్యపై ఇప్పటికే ఎన్నో సార్లు ఇరిగేషన్, హెచ్ఎండీఏ, మున్సిపల్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేశాం. అధికారులు సమన్వయంతో పని చేస్తే సమస్య ఎప్పుడో పరిష్కారమయ్యేది. ఇరిగేషన్ అధికారులు ముందుగా నాలా మ్యాప్‌ను గుర్తించి మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులకు నివేదిక ఇవ్వాలి. తమ సొంత నిధులతో చెరువు కట్ట అభివృద్ధితో పాటు నాలా పైపులైన్ పనులను చేశాం. ఇప్పటికైనా అధికారులు పనులను త్వరగా పూర్తి చేయాలి.

– ఎంబరి ఆంజనేయులు, స్థానికుడు

ట్రా'ఫికర్'



ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

జీడిమెట్ల: ఐడీపీఎల్ చౌరస్తా నుంచి షాపూర్‌నగర్ వరకు బుధవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కున్నాయి. సమయానికి రెండు చౌరస్తాల్లో పోలీసులు లేకపోవడంతో ట్రాఫిక్‌లో మరింత అంతరాయం కలిగింది. ఐడీపీఎల్, చింతల్ మధ్యలో అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. ప్రతిరోజు మధ్యాహ్నం ఇదే తంతు కొనసాగుతుందని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

పరిశ్రమ బస్సులు రోడ్లపై నిలుపడంతో..

బాలానగర్ నుండి బొంతపల్లి, ఖాజీపల్లి, పోమమైలారం, గండిమైసమ్మకు వెళ్లే పరిశ్రమల బస్సులు మధ్యాహ్నం ఎక్కువగా వెళ్తుంటాయి. ఈ సమయంలో బస్సుల్లో ఉద్యోగులను ఎక్కించుకునేందుకు డ్రైవర్లు రోడ్లపై బస్సులను నిలుపుతున్నారు. ఇది ట్రాఫిక్ పోలీసులు సైతం కనిపెట్టలేకపోతున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర జాప్యం జరుగుతుంది. ఇప్పటికైనా పోలీస్ అధికారులు స్పందించి పరిశ్రమల బస్సులు రోడ్లపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నిజాంపేట్: కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి చొరవతో బుధవారం బాచుపల్లి 18వ డివిజన్ నందనవనం కాలనీలో రోడ్డు పనులను స్థానికులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నందనవనం కాలనీలో సీసీ రోడ్డు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఆయన స్పందించి మున్సిపల్ కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్లు మంజూరు చేయించారన్నారు. మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, కొలన్ బాల్‌రెడ్డి, రాజేందర్, జిత్తు, సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయంపై ఫోకస్ !

- పురపాలికల్లో ఆస్తులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి
- పునరుద్ధరించుకోకపోతే జరిమానా విధించే అవకాశం

సాక్షి,మేడ్చల్ జిల్లా: అర్బన్, సెమీ అర్బన్‌గా అభివృద్ధి చెందిన నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పురపాలికల్లో వ్యాపార లైసెన్సు రుసుం ద్వారా ఆదాయం పెంచుకోవడానికి అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. గత కొన్నేళ్లుగా దీనిపై పూర్తి స్థాయిలో దృష్టి సారించకపోవడంతో బల్దియాల ఆదాయానికి గండి పడిందని భావిస్తున్న అధికారులు ప్రస్తుతం వాణిజ్య, మిశ్రమ వినియోగ (గృహం, వాణిజ్య భవనం కలిసి ఉన్నవి) ఆస్తుల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి చేశారు.

– జిల్లాలోని 16 పురపాలక సంఘాల పరిధిలో 18,056 వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉండగా.. క్షేత్ర స్థాయిలో 8,032 దుకాణాలకు మాత్రమే లైసెన్స్‌లు ఉన్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది.

10,645 దుకాణాలకు 3,825 లైసెన్సులు..

జిల్లా పరిధిలోని బోడుప్పల్, నిజాంపేట్, జవహర్‌నగర్, దుండిగల్, కొంపెల్లి, నాగారం పురపాలికల్లో మొత్తంగా 10,645 వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండగా.. 3,825 వాటికి మాత్రమే ట్రేడ్ లైసెన్సులు ఉన్నట్లు మున్సిపల్‌శాఖ గుర్తించింది. మిగతా 7,058 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు జారీ చేయలేదని తెలుస్తోంది.

◆ బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 2035 వ్యాపార సముదాయాలు ఉండగా.. ట్రేడ్ లైసెన్సులు పొందిన దుకాణాలు (షాపులు) 455 మాత్రమే ఉన్నాయి. నిజాంపేట నగర పాలక సంస్థలో 4354కు 2135కు లైసెన్స్‌లు తీసుకున్నారు.

◆ జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 750కి 282, దుండిగల్ మున్సిపాలిటీలో 1248 కి 432, కొంపెల్లిలో 1047కి 256, నాగారంలో 1211 వ్యాపార సముదాయాలకు 265 ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. అదే పరిస్థితి మిగతా పురపాలికల్లో నెలకొని ఉందని తెలుస్తోంది.

ఆసక్తి చూపని వ్యాపారులు..

◆ బ్యాంకులో రుణం తీసుకున్న వారు తప్పా.. మిగతా వ్యాపార సముదాయాలకు సంబంధించిన వారంతా ట్రేడ్ లైసెన్సులు పొందటానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో ఆదాయానికి భారీగా గండి పడుతోంది. జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం ద్వారా పురపాలక సంఘాల్లో మరింత ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది.

అత్యధికంగా రూ.లక్ష ఫీజు

◆ రహదారి విస్తరణ ఆధారంగా వాణిజ్య, వ్యాపార దుకాణాలకు కొలతలు తీసుకుంటున్నారు. సాధారణంగా ఒక చదరపు అడుగుకు రూ.5 చొప్పున లెక్కిస్తున్నారు. ఒక్కో దుకాణానికి వ్యాపార లైసెన్స్‌కు కనీసం రూ.200ల నుంచి అత్యధికంగా రూ. లక్ష ఉంటోంది. దీనికంటే అధిక మొత్తం వేయడానికి వీలు లేకుండా శ్లాబు విధించారు.

పునరుద్ధరించుకోకపోతే..

◆ ఆస్తిపన్ను మాదిరిగానే ఏటా దుకాణాలకు వ్యాపార లైసెన్స్ ఫీజు చెల్లించకపోతే జరిమానా విధిస్తారు. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోగా చెల్లించే వారికి ఎలాంటి అపరాధ రుసుము ఉండదు. ఆ తర్వాత పునరుద్ధరించుకోవడానికి దరఖాస్తు చేస్తే 25శాతం జరిమానా విధిస్తున్నారు.

సమస్యలు ఇవే..

◆ ఆన్‌లైన్‌లో చూపిస్తున్న దుకాణాలు, సంస్థలు, క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. లైసెన్స్ వివరాలను ఒకసారి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత వాటిని మార్చడం అసాధ్యం. దీంతో వ్యాపారి పేరుపై ఇంటి పేరుతో ట్రేడ్ లైసెన్స్ ఛార్జీలు నమోదవుతూనే ఉన్నాయి. కొందరు వ్యాపారంలో దెబ్బతిని కొన్నేళ్లు మూసేసి, తర్వాత కొత్తగా వ్యాపారం ప్రారంభిస్తున్నారు. కొత్త వ్యాపారానికి లైసెన్స్ తీసుకోవాలనుకుంటే పాత వ్యాపారం లైసెన్స్‌కు సంబంధించిన బకాయిలు కట్టమంటున్నారని వ్యాపారులు వాపోతున్నారు.

విజిలెన్స్.. సైలెన్స్?

- 'సాక్షి' కథనంతో ఖంగుతిన్న అధికారులు
- పేరుకే క్షేత్రస్థాయి పరిశీలన
- అవినీతి అధికారులపై చర్యలు తీసుకునేనా?



20 మీటర్ల కేబుల్ వేయాలని జారీ చేసిన లెటర్



కుత్బుల్లాపూర్: తిన్నామా.. పడుకున్నామా.. తెల్లారిందా..! అన్న చందంగా మారింది విజిలెన్స్ అధికారుల పనితీరు. ఒక వైపు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే విషయంలో, పోల్ షిఫ్టింగ్, విద్యుత్ లైన్ల కేబుల్, బహుళ అంతస్తుల నిర్మాణాల వద్ద ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్లు , నోటరీ స్థలాల్లో విద్యుత్ కనెక్షన్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అక్రమాలు ఉన్నట్లు తెలుస్తోంది. అవినీతిని గుర్తించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆ వైపుగా చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. షాపూర్‌నగర్ సెక్షన్ పరిధిలో ఇటీవల ఓ అధికారి, ఆర్టిజన్ కలిసి ఎస్టిమేషన్ ఒక విధంగా.. పనులు మరో విధంగా చేసి అందిన కాడికి దండుకున్న విషయంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. పనులు జరిగిన ఒకటి రెండు రోజుల్లోనే.. ఇక్కడ అవినీతి అక్రమాల విషయంపై వారికి సమాచారం ఉన్నప్పటికీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. 'సాక్షి'లో ఈనెల 5వ తేదీన 'ప్రణాళికలు ఒక విధంగా.. పనులు మరో విధంగా..! అన్న కథనంతో విజిలెన్స్ అధికారులు కంగుతిన్నట్లు తెలుస్తోంది. కథనంతో విచారణ చేస్తున్నట్లు వచ్చామా.. వెళ్లామా? అని హడావిడి చేసి వెళ్లడం విశేషం.

20 మీటర్లకు బదులు 70 మీటర్లు..

ఎల్సీలు తీసుకునే విషయంలో ప్రభుత్వం పలు నిబంధనలు పెట్టి 10 నుంచి 15 నిమిషాలు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేసి మరమ్మతులు చేయాలని ఆదేశాలు ఉన్నాయి. కానీ ఎస్.ఆర్ నాయక్‌నగర్ అపురూప కాలనీ ఫీడర్‌లో 20 మీటర్ల కోసం అనుమతి తీసుకుని ఏకంగా 70 మీటర్లు వేయడం విశేషం. ఓ అధికారి అతని బినామీగా ఉన్న ఆర్టిజన్ ఇద్దరు కలిసి ఈ తతంగానికి తెర లేపారు. భవన యజమాని నుంచి పెద్ద ఎత్తున ప్రభుత్వానికి రావాల్సిన డబ్బులు పైన పేర్కొన్న ఇద్దరు జేబులో వేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిలో ఉన్నతాధికారులకు కూడా భాగమైనట్లు సమాచారం. ప్రత్యేకంగా ఎల్సీ తీసుకొని ఏకంగా రెండు, మూడు గంటలసేపు విద్యుత్ సరఫరా నిలిపివేసి ఒక పోలుకు సాంక్షన్ ఉండగా.. రెండు పోల్స్ ఏర్పాటు చేసి కేబుల్ గుంజడం.. సపోర్ట్ రాడ్డు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. చెట్టుకు కట్టి వెళ్లడం పై సాక్షి కథనం ప్రచురించింది. విజిలెన్స్ అధికారులు సంబంధిత సాంక్షన్ కాపీ తీసుకొని అక్కడ జరిగిన అవినీతి విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలి. కానీ కేవలం తూతూ మంత్రంగా వచ్చి వెళ్లడంతో సదరు అధికారి.. 'మీరు మమ్మల్ని ఏమీ చేయలేరు' అంటూ కిందిస్థాయి సిబ్బందిపై జులుం ప్రదర్శించడం విశేషం. ఈ విషయంపై షాపూర్‌నగర్ ఏడీఈ వీరేశలింగం క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పినా.. ఇంతవరకు ఆ దిశగా ముందుకు వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తుంది.

మెరుగైన వసతులు కల్పిస్తాం

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



పార్కులో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి

సుభాష్‌నగర్: ప్రజలకు మెరుగైన వసతులు అందించే దిశగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గోదావరి హోమ్స్‌లోని జీహెచ్ఎంసీ పార్కులో రూ.28.2 లక్షల నిధులతో అభివృద్ధి చేసిన వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లను కార్పొరేటర్ తారాచంద్రారెడ్డి, డీసీ నర్సింహులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పార్కులో మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహారెడ్డి, కాలనీ అధ్యక్షుడు తిరుమల్‌రావు, ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జోగిని రాజు, సిద్దిరాములు, సుమేర్ సింగ్, గోవర్ధన్ రెడ్డి, చంద్రారెడ్డి, శ్రీదేవి, సంజీవ్ రెడ్డి, వీరారెడ్డి, నార్లకంటి దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

అడిషనల్ డీసీపీ పురుషోత్తం



వాహనదారుల వివరాలు తెలుసుకుంటున్న అడిషనల్ డీసీపీ పురుషోత్తం

సుభాష్‌నగర్: వాహనదారులు నియమ నిబంధనలు పాటించాలని అడిషనల్ డీసీపీ పురుషోత్తం అన్నారు. బుధవారం సూరారం పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం సూరారం విలేజ్ ప్రధాన రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాలను ఆపి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల సంబంధించిన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని పేర్కొన్నారు. ప్రతి వాహనం రిజిస్ట్రేషన్ చేసుకుని నెంబర్ ప్లేట్ కలిగి ఉండాలని సూచించారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ సుధీర్ కృష్ణ, ఎస్ఐ లిమా తదితరులు పాల్గొన్నారు.

ఏ హోదాలో అభివృద్ధి పనులు ప్రారంభించారు?

బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ శివాజీ రాజు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కుత్బుల్లాపూర్: కొంపల్లి మున్సిపాలిటీలో రూ.40 లక్షలతో బీటీ రోడ్డు పనులకు ఏ హోదాలో కొలను హనుమంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారో సమాధానం చెప్పాలని బీజేపీ కత్బుల్లాపూర్ అసెంబ్లీ కో కన్వీనర్ పొత్తూరి శివాజీ రాజు ప్రశ్నించారు. బుధవారం కొంపల్లిలో బీజేపీ అధ్యక్షుడు సతీష్‌సాగర్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంపల్లి మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్, కమిషనర్‌లకు సమాచారం లేకుండా పనులు ప్రారంభించడం సిగ్గుచేటని విమర్శించారు. తమ పార్టీ అధికారంలో ఉందని ఇష్టం వచ్చినట్టు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఇటువంటి చర్యలను ప్రోత్సహిస్తే వారిపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం సతీష్ సాగర్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో కొంపల్లి మున్సిపాలిటీలో ఎంపీ ఈటల రాజేందర్‌కు సమాచారం లేకుండా శంకుస్థాపనలు చేపడితే అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరిత, మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

బస్‌బేలో బస్సులు ఆపరా?

రంగారెడ్డినగర్: బస్ షెల్టర్ ఉన్నా బస్సులు బస్‌బేలోకి రాకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే ఎదురు చూస్తున్నారు. షాపూర్‌నగర్ – గాజులరామారం చౌరస్తాను ఇటీవల విస్తరించారు. దీంతో ఈఎస్ఐ ఆస్పత్రి సమీపంలో రోడ్డును ఆనుకుని ఉన్న బస్ షెల్టర్‌ను అధికారులు కాస్త వెనక్కి ఏర్పాటు చేశారు. అయితే ఆర్టీసీ బస్ డ్రైవర్లు బస్సులను బస్టాప్‌లోని బస్‌బేలోకి కాకుండా రోడ్డుపైనే నిలుపుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే నర్సాపూర్ రాష్ట్ర ప్రధాన రహదారి కావడంతో బస్సు ఎక్కే క్రమంలో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపైనే బస్సులు ఆపడంతో ముఖ్యంగా వృద్ధులు, మహిళా ప్రయాణికులు, చిన్నారుల తల్లులు బస్సు ఎక్కేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. సమీపంలోనే సిగ్నల్స్ ఉండటంతో ఎక్కడ బస్సులు వెళ్లిపోయాతాయోనన్న తొందరలో ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్‌షెల్టర్ వరకు బస్సులు రాకపోవడంతో ఆటోవాలలు తిష్ట వేస్తున్నారు. ఈఎస్ఐ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న బస్‌షెల్టర్ బస్‌బేలోకి బస్సులు ఆగేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

